# రేవంత్‌రెడ్డి తీరు అమానవీయం

- ఓటమి భయంతోనే భౌతిక దాడులు
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి
- రూ. 2లక్షల చెక్కును అందజేసిన రైతులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 31: ఎంపీ ప్రభాకర్ రెడ్డి దవాఖానలో చికిత్స తీసుకుంటే పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చాలా నీచంగా మాట్లాడుతున్నాడని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు.మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభాకర్ రెడ్డి చావుబతుకుల్లో ఉంటే కోడి కత్తి డ్రామా అని రేవంత్ రెడ్డి వాఖ్యలు చేస్తున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి కుట్రలు, హత్యా రాజకీయాలు కొత్తవి కావని అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి రేవంత్ రెడ్డి హింసా రాజకీయాలకు దిగుతున్నారని అన్నారు.

**రైతుల నుంచి బీఆర్ఎస్‌కు మద్దతు..**

నిర్మల్ బీఆర్ఎస్ ఎమెల్యే అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి మద్దతుగా నియోజకవర్గంలోని పాక్‌పట్ల, గాంధీనగర్, పోచంపాడ్, మాదాపూర్ గ్రామాల రైతులు నిలిచారు. స్వచ్ఛందంగా రూ.రెండు లక్షల పదహార్లు విరాళం చెక్కును మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి అందించారు. పాక్‌పట్ల నుంచి క్యాంప్ కార్యాలయం వరకు 25 ట్రాక్టర్లతో రైతులు ర్యాలీగా తరలివచ్చారు. నిర్మల్ జిల్లా పాక్‌పట్లలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా నామినేషన్ ఖర్చుకోసం ఈ చెక్కును అందజేసినట్లు రైతులు తెలిపారు. విరాళం ఇచ్చిన రైతులకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

**CHANGE OF NAME**

★ I'm ALETI PRAKASH, R/o. H.No. 5-21/12, Venkatapur, Nirmal District, TS., have Change My Name as ALETI PRAKASH REDDY, S/o. Aleti Raja Reddy.
NT-320724

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




## బీజేపీ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలి

- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏమాజీ
- బెల్లంపల్లిలో శ్రేణులతో కలిసి రాస్తారోకో

బెల్లంపల్లి, అక్టోబర్ 31 : బెల్లంపల్లి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అమరాజుల శ్రీదేవి టికెట్‌ను రద్దు చేయాలని, లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ హెచ్చరించారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం బీజేపీ శ్రేణులతో రాస్తారోకో నిర్వహించారు. అంతకు ముందు పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బొల్లెడ కేశవరెడ్డి, సీనియర్ నాయకులు అజ్మీరా శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, దూది ప్రకాశ్‌లతో కలిసి ఏమాజీ మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఏమాజీకి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా ఇటీవల పార్టీలో చేరిన శ్రీదేవికి టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించడం శోచనీయమన్నారు. ఏ ప్రాతిపదికన టికెట్ కేటాయించారో అధిష్టానం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నాయకులు ప్రభాకర్, శ్రావణ్‌కుమార్, నర్సింగ్, సత్యనారాయణ, బియ్యాల గట్టయ్య, సుభాష్ అజ్మీరా, కోలా ప్రవీణ్‌కుమార్, కలాలికృష్ణ, బ్రహ్మానందం, ప్రభాకర్, కోట రాజు, వంశీ, రామయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

చెన్నూర్, అక్టోబర్ 31 : దుబ్బాక ఎన్నికల ప్రచారంలో ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్త కత్తితో దాడి చేయడాన్ని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. చెన్నూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మంగళవారం కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతె తిరుపతి, మున్సిపల్ కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, జోడు శంకర్, సుందరశాల సర్పంచ్ రాజమౌళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఖాజా ఖంరోద్దీన్, మానికరౌతు శంకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తుల సమ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, మేడ సురేష్‌రెడ్డి, పెండ్యాల లక్ష్మణ్, నాయిని సతీష్, వీరమల్ల రాము, కొండపర్తి వెంకటరాజం, అయిత సురేష్‌రెడ్డి, ఏలేశ్వరం నర్సింహచారి, అన్నల తిరుపతి, కుందారపు రవీందర్, తుంగపిండి రాజేశ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కల్లోలం

- పారాచ్యూట్ నేతలకు టికెట్ల కేటాయింపుపై ఆగ్రహావేశాలు
- ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో నిరసనలు
- మూడు రోజులుగా అట్టుడుకుతున్న ఆదిలాబాద్ జిల్లా..

ఆదిలాబాద్, అక్టోబర్ 31(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ రెండో విడుత టికెట్ల పంపిణీ వ్యవహారం ఆదిలాబాద్ జిల్లాలో హస్తం పార్టీలో కల్లోలం సృష్టిస్తోంది. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ టికెట్‌లను కాంగ్రెస్ పార్టీ సీనియర్‌లు కష్టకాలంలో జెండా మోసిన వారికి కాదని పారాచ్యూట్, మూటలిచ్చిన నాయకులకు టికెట్లు ఇచ్చారని మూడు నియోజకవర్గాల్లో సీనియర్లు ఆరోపిస్తున్నారు. ఆదిలాబాద్‌లో సోమవారం 'సేవ్ కాంగ్రెస్ ఫ్రం ఆర్ఎస్ఎస్' పేరిట నియోజకవర్గ కార్యకర్తలు సమావేశం నిర్వహించగా డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, సీనియర్ నాయకులు సంజీవ్ రెడ్డిలు హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు తాము మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదని నేతలు స్పష్టం చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం కార్యకర్తల సమావేశాన్ని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఏఐసీసీ పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాశ్ హాజరయ్యారు. టికెట్ ఆశించిన సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరుకాలేదు. బోథ్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వన్నెల అశోక్ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించగా.. టికెట్‌లు ఆశించిన సీనియర్‌లు నరేశ్ జాదవ్, ఆడే గజేందర్‌లు వారి అనుచరులు ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు.

**ఖానాపూర్ విషయంలో అన్యాయం చేశారు..**
**: ఉట్నూర్ జడ్పీటీసీ చారులత రాథోడ్**

కాంగ్రెస్ అధిష్టానం ఖానాపూర్ టికెట్ విషయంలో తనకు అన్యాయం చేసిందని ఉట్నూర్ జడ్పీటీసీ చారులత రాథోడ్ మండిపడ్డారు. పార్టీలో నాయకులతో ఆమె చర్చించారు. పార్టీలో మహిళలకు కనీస గౌరవం లేదన్నారు. తనతోపాటు ఆసిఫాబాద్ టికెట్ ఆశించిన సరస్వతికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్లు నిరాకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై చిన్నచూపు చూస్తున్న కాంగ్రెస్ ఇతర పార్టీల గురించి ఎలా మాట్లాడుతోందని ప్రశ్నించారు. 15 సంవత్సరాలుగా తాను పార్టీకి సేవ చేస్తున్నానని, కష్టకాలంలో జెండాను మోసినట్లు తెలిపారు. పార్టీ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో తనను జడ్పీ చైర్మన్‌గా ప్రకటించి డబ్బులు ఖర్చు పెట్టించారని, ఇతర పార్టీల్లో చేరమని తనకు అవకాశాలు వచ్చినా ఖానాపూర్ టికెట్ వస్తుందనే ఆశతో నిరాకరించినట్లు తెలిపారు. సీనియర్లను కాదని పారాచ్యూట్, డబ్బుల మూటలు పట్టుకుని వచ్చిన వారికి టికెట్‌లు కేటాయించారని ఆరోపించారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండకుండా తప్పుడు నిర్ణయాలు తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ ఆశించిన తనను ఇప్పటివరకు పార్టీ నాయకులు ఫోన్ చేసి పలకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌లు కుమ్మక్కై టికెట్‌ను కేటాయించారని, అభ్యర్థి గెలిచే అవకాశాలు లేవని స్పష్టం చేశారు. కార్యకర్తలతో చర్చించి రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తామన్నారు.

## గాంధీభవన్‌ను కిరాయికి ఇవ్వండి..

- కౌంటర్లు పెట్టి టికెట్లు అమ్ముకోండి..
- పార్టీని నమ్ముకున్న వారిని నట్టేట ముంచింది
- పీసీసీ సభ్యుడు గణేశ్ రాథోడ్

అసిఫాబాద్, అక్టోబర్ 31 : రానున్న రోజుల్లో కాంగ్రెస్ అసెంబ్లీ టికెట్లు అమ్ముకునేందుకు గాంధీ భవన్‌ను కిరాయికి ఇచ్చి టికెట్లు అమ్ముకునేందుకు కౌంటర్లు పెట్టాలని పీసీసీ సభ్యుడు గణేశ్ రాథోడ్ అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిష్టానం డబ్బులకు అమ్ముడుపోయి ప్యారాచూట్‌కు టికెట్ ఇచ్చి పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఓడిపోయే వ్యక్తులకు సీట్లు కేటాయించారని మండిపడ్డారు. ఎన్నికలు ముగిశాక గాంధీ భవన్‌ను కిరాయికి ఇవ్వాలని రేవంత్ రెడ్డికి సూచించారు. 2019 నుంచి నియోజకవర్గంలోని కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా ఎంతో కృషి చేశానని పేర్కొన్నారు. అవినీతిపరుడైన శ్యాం నాయక్ టికెట్ కేటాయించడంతో ప్రజలకు పార్టీపై నమ్మకం కోల్పోయిందన్నారు. ఒక్కో ఎంపీఐని రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో 10 మంది ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారని, దీంతో శ్యాం నాయక్ పై ఏసీబీ కేసు నమోదయ్యిందని, ఉద్యోగం నుంచి తొలగిస్తారని భావించి ముందుగానే వీఆర్ఎస్ తీసుకొని ప్రజలకు సేవ చేస్తానంటూ కపట ప్రేమ చూపిస్తున్నాడని ఆరోపించారు. ఖానాపూర్‌లో రేఖా శ్యాంనాయక్ దళిత బంధు, అభివృద్ధి పథకాల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపణతో ఆ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించలేదని విమర్శించారు. భార్యకు టికెట్ కేటాయించకపోవడంతో అదే రోజు శ్యాంనాయక్ కాంగ్రెస్‌లో చేరి నియోజకవర్గ టికెట్ కోసం రేవంత్ రెడ్డికి, తెలంగాణ ఇన్‌చార్జి ఖర్గేకు డబ్బులు ఇచ్చాడని తనకే టికెట్ వస్తుందని ప్రచారం చేస్తూ ఉన్నప్పుడు మేము ఏదో పిచ్చోడు మాట్లాడుతున్నాడులే అని అనుకున్నామన్నారు. శ్యాంనాయక్ రేవంత్ రెడ్డికి హైదరాబాద్ సమీపంలో మూడెకరాల భూమి బినామీల పేరిట ఇచ్చాడని ఆరోపించారు. టికెట్ల డబ్బులు కమ్మి కార్యకర్తలను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో అధిష్టానం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇవ్వకపోతే తమ కార్యచరణను రూపొందించుకొని నియోజకవర్గంలో ఎన్నికల బరిలో ఉంటామని స్పష్టం చేశారు. శ్యాంనాయక్ గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని తెలిపారు. నాయకులు ఎండీ నిజాం, గడ్డల సత్తన్న, దుర్గం సోమ య్య, సత్తర్, మానిక్‌రావు, రాము, ఇస్మాయిల్, బాబుపటాన్, గోవింద్, ఆసీఫ్, తిరుపతి, ప్రశాంత్, సంతోష్, పోశాలు పాల్గొన్నారు.

## దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

రెబ్బెన, అక్టోబర్ 31 : మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి, జడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థిపై హత్యాయత్నం అనేది కాంగ్రెస్ నీచపు రాజకీయానికి నిదర్శనమన్నారు. రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ ఇలాంటి పద్ధతి సరైంది కాదన్నారు. సమావేశంలో జడ్పీటీసీ వేముర్ల సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, రైతుబంధు సమితి జిల్లా సభ్యురాలు కుందారపు శంకరమ్మ, ఎంపీటీసీ పెసరి మధునయ్య, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు చెన్న సోమశేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పర్లపల్లి వనజ, కోఆప్షన్‌మెంబర్ జౌరొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌జైస్వాల్, అజయ్‌జైస్వాల్, బొమ్మినేని శ్రీధర్, పందిర్ల మధునయ్య, తనుకు మురళీ, పర్వతీఅశోక్, ప్రతాప్ తదితరులున్నారు.

## మావోయిస్టులపై ప్రత్యేక నిఘా పెట్టాలి

- గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీఎం విజయకుమార్, ఐజీ(రిటైర్డ్) ప్రభాకర్ రావు
- ఉమ్మడి జిల్లా ఎస్పీలతో సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 31 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా పెట్టాలని గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీఎం విజయ్ కుమార్, ఎస్ఐబీ ఐజీ ప్రభాకర్ రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ పోలీస్ ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఎస్పీ కార్యాలయంలో పోలీసు గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మావోయిస్టు కదలికలపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాల విడుదల వరకు ప్రతి దశలో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాకు అదనంగా కేటాయించిన కేంద్ర పారామిలటరీ బలగాలను ఉపయోగించి పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను ఉపయోగించి పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని సూచిస్తూ అక్రమ నగదు, మద్యం సరఫరా వంటి అనైతిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎస్పీ కే సురేశ్ కుమార్, వేణుగోపాలారావు ఎస్ఐబీ, ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, నిర్మల్ ఎస్పీ సీహెచ్ ప్రవీణ్ కుమార్,అడిషనల్ ఎస్పీ అడ్మిన్ అచ్చే శ్వరరావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విజయ రాఘవన్, డీఎస్పీలు వెంకట రమణ, కరుణాకర్, రమేశ్, సీఐలు , ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.